www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 29 జులై 2024

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ఎకార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

కొనసాగుతున్న సోదాలు

- ఒక్కొక్కటిగా బయటపడుతున్న వైసిపి నేతల బాగోతాలు
- తాజాగా మాజీ ఎమ్మెల్యే ఇంట్లో రెవెన్యూ, పోలీసుల తనిఖీలు

మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంటి వద్ద బందోబస్తు ఉన్న పోలీసులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాల ఘటన కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. తాజాగా మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో సోదాలు చేపట్టేందుకు ఆదివారం ఉదయం ఆయన ఇంటికి పోలీసులు వెళ్లారు. ఇంటికి తాళాలు వేసి ఉండటానికి గమనించి ఫోన్ ద్వారా సంప్రదించి సమాచారం అందించారు. తన కుటుంబ సభ్యులతో సహా బెంగళూరు వెళ్లానని సాయంత్రానికల్లా మదనపల్లెకు చేరుకుని ఏ విషయంలో నైనా మీకు సహకరిస్తానని చెప్పడంతో సాయంత్రం వరకు వేచి చూశారు. సాయంత్రం మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా స్వగృహానికి చేరుకోవడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం ఆయన ఇంట్లో వివిధ రికార్డులను పరిశీలించి, తనిఖీలు చేపట్టారు. కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులను లోనికి అనుమతించకుండా బయటే నిలిపివేశారు. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా పై పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలినాళ్లలోనే విలువైన భూములపై కన్నేసి, కొన్ని భూములను హస్తగతం చేసుకున్నాడని, ముఖ్యంగా వక్ఫ్ భూములను సైతం కొన్నింటిని పేర్లు మార్చి తన బినామీ పేర్లమీద రిజిస్టర్ చేయించుకున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఇవే కాకుండా 22-ఎ భూముల పైన కన్నేసిన మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ భూములు, నిషేదిత, డీకేటి భూములను సైతం ఆక్రమించుకుని తన అనునాయులతో భారీ వెంచర్లు వేసినట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. ఇదిలా ఉండగా వైసిపి ప్రభుత్వంలో వలసపల్లి పంచాయతీలో లారీ అసోసియేషన్ పేరుతో సుమారు 8 ఎకరాలకు పైగా 200 కోట్ల విలువ చేసే భూములను కాజేసేందుకు విశ్వ ప్రయత్నం చేసి, తనకు అనుకూలమైన రెవెన్యూ అధికారులను నియమించుకుని ఆ దిశగా ఫైళ్లు మూవ్ చేసి, ఇప్పటికే ఆ భూములను హస్తగతం చేసుకున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ విషయాన్ని అదే పార్టీలో ఉన్న వలసపల్లి సర్పంచ్ తనయుడు, వైసిపి నాయకుడు నాగరాజు రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి మరీ బహిరంగంగానే విమర్శించారు. ఇదివరకే వైసిపి నాయకులు, సానుభూతిపరులు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులుగా ముద్ర వేసుకున్న మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకట చలపతి, మిట్టపల్లె సర్పంచ్ భర్త బండపల్లి అక్కులప్పలను పోలీసులు స్టేషన్ పిలిపించి విచారించారు. వారి ఇళ్లల్లో సోదాలు చేపట్టి పలు రికార్డులు, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం తదుపరి విచారణకు సహకరించాలని, పిలిచినప్పుడు తప్పక రావాలని, పోలీసు అనుమతి లేనిదే మదనపల్లె విడిచి వెళ్లకూడని షరతులతో కూడిన నోటీసులు ఇచ్చి పంపించివేశారు. మరో వైసిపి నాయకులు బాబ్జాన్ అందుబాటులో లేకపోవడంతో అతని కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. భూ కబ్జాలు, భూములను అన్యాక్రాంతం చేసుకోవడంతో పాటు పెద్ద ఎత్తున 22ఎ భూముల కుంభ కోణంలో ప్రధాన పాత్రదారుడిగా ఆరోపణలు ఎదొర్కొంటున్న వారిలో ముందు వరుసలో ఉన్న రైస్ మిల్ మాధవరెడ్డి పరారీలో ఉండడంతో గాలింపులు చేపడుతున్నట్లు పోలీసుల ద్వారా తెలుస్తోంది. విచారణకు ఎక్కడ భంగం వాటిల్లుతుందోనని రైస్ మిల్ మాధవరెడ్డి పోలీసుల అదుపులోనే ఉన్నా పరారీలో ఉన్నట్లు పోలీసులే ప్రచారం చేస్తున్నట్లు కూడా గుసగుసలు వినపడుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ వరుసగా వైసిపి నేతల ఇళ్లల్లో పోలీసులు సోదాలు చేపట్టడం, పలు రికార్డులు స్వాధీనం చేసుకోవడం, తాజాగా మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా ఇంట్లో కూడా సోదాలు నిర్వహిస్తుండడంతో వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ముఖ్యంగా గతంలో రియల్టర్లుగా కొనసాగినవారు, భారీ వెంచర్లు వేసి ప్రభుత్వ, డికెటి భూముల వివాదాల్లో తల దూర్చిన వారు ఇప్పటికే పట్టణం వదిలి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఇందులో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తట్టి శ్రీనివాసులరెడ్డి బారీ వెంచర్లు వేసి మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషకు బినామిగా ఉన్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తట్టి శ్రీనివాసుల రెడ్డి మదనపల్లెను విడిచి వెళ్లిపోవడం ఇందుకు ఊతమిస్తోంది. పెద్ద ఎత్తున భూ అక్రమణలు జరగడం వెనుక అసలు సూత్రధారి ఎవరు అన్నది తెలియాల్సి ఉంది. ఇప్పటికే సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు స్వీకరించిన సిసోడియాకు బాధితులు 400 కు పైగా అర్జీలను నేరుగా ఆయనకే చేర్చారు. తదుపరి రెండు రోజులు మరో 100 మంది బాధితులు అర్జీలను సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేర్చారు. అన్ని అర్జీలలోను గత వైసిపి ప్రభుత్వ హయాంలో తమ భూములను బలవంతంగా లాక్కున్నారని, ఆక్రమించుకున్నారని, దౌర్జన్యం చేసి కబ్జాలు చేశారని వైసిపి నేతలు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులపైన ఆరోపణలు గుప్పిస్తూ అర్జీలు ఇచ్చినట్లు స్వయంగా విచారణాధికారి, రెవెన్యూ ఛీఫ్ సెక్రటరీ సిసోడియానే ప్రకటించడం గమనార్హం. దీంతో పోలీసులు వరుసగా వైసిపి నేతల ఇళ్లల్లో సోదాలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటన ముగించుకొని నేడు రాష్ట్రానికి చేరుకోనున్న నేపథ్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయ ఘటన కేసులో కీలకమైన పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలు కనబడుతున్నాయి. ఇదివరకే విచారణ ఎదొర్కొంటున్న పూర్వపు ఆర్‌డిఒలు మురళి, హరి ప్రసాద్,దస్త్రాల దహన ఘటనకు మూల కారకుడిఅ భావిస్తున్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజలను సస్పెండ్ చేయడంతో పాటు అరెస్టు చేసే అవకాశాలు కూడా కనబడుతున్నాయి. ఆ తదుపరి మిగతా వారిపై చర్యలకు ఉపక్రమించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. మదనపల్లెలో జరిగిన ఘటనకు నేటితో తొమ్మిది రోజులు కావస్తున్న నేపథ్యంలో ఇంతవరకు దర్యాప్తు, విచారణకే పరిమితం కావడం, ఎవరిపైనా చర్యలు తీసుకోకపోవడం, ఈ దుశ్చర్యకు వీరే బాధ్యులని ప్రకటించకపోవడంతో ఈ ఘటనకు తెర ఎప్పుడు పడుతుందోనని రాష్ట్రం యావత్తు ఎదురుచూస్తోంది.

తంబళ్లపల్లె ఎమ్మెల్యే ఇంట్లోనూ పోలీసుల సోదాలు

తంబళ్లపల్లె ఎమ్మెల్యే, మాజి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోదరుడు ద్వారకనాథరెడ్డి స్వగృహం తంబళ్లపల్లెలో శనివారం రాత్రి, ఆదివారం పగలు సోదాలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో ఉన్న ఆయన కార్యాలయాల్లో, ముఖ్య అనుచరుల ఇళ్లల్లో సైతం సోదాలు చేసినట్లు సమా చారం. ఇదిలా ఉండగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రెడ్డి కార్యాలయాల్లో, కంపె నీల్లో, వివిధ ప్రాంతాల్లో గృహాలలో పోలీసులు సోదాలు చేపడుతున్నారు. వీలైనంత త్వరగా ఈ కేసును ఛేదించేందుకు రెవెన్యూ శాఖ ముఖ్యాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు ఇప్పటికే నివేదికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

ప్రపంచీకరణ విధానాల వల్లే అప్పులు

- హామీల అమలు కోసం పోరాడాలి
- 2025లో ప్రపంచం ఆర్థిక సంక్షోభం ఎదుర్కోబోతుంది
- రాష్ట్ర విద్యా సదస్సులో ఆర్థిక విశ్లేషకులు వి.రాంభూపాల్

సదస్సులో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రపంచీకరణ విధానాల వల్లే అప్పులు పెరిగిపోతున్నాయని ఆర్థిక విశ్లేషకులు వి. రాంభూపాల్ అన్నారు. ఆదివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎస్.వి. ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర విద్యా సదస్సు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి .లక్ష్మి రాజా అధ్యక్షత నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక శ్వేత పత్రం - వాస్తవాలు' అనే అంశంపై రాంభూపాల్ ప్రసంగించారు. టిడిపి కూటమి విడుదల చేసిన ఆర్థిక శ్వేత పత్రం వాస్తవాలకు విరుద్ధంగా ఉందని విమర్శించారు. 2014 -24 మధ్యకాలంలో అప్పులు ఎందుకు పెరిగాయి దానికి కారణమైన కేంద్రంలోని బిజెపి గురించి చెప్పకపోవడం తీవ్ర తప్పిదమని పేర్కొన్నారు. 2014-15 రాష్ట్ర విభజన నాటికి ఆంధ్రప్రదేశ్ జనాభా 58 శాతం అయితే ఆదాయం మాత్రం 46 శాతం వచ్చిందని తెలిపారు. తెలంగాణ జనాభా 42 శాతం ఆదాయం 54శాతం ఇచ్చి ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేశారని శ్వేత పత్రంలో పేర్కొన్నారని చెప్పారు. విభజన సందర్భంగా ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం, రాజధానికి నిధులు ఇవ్వని కేంద్ర ప్రభుత్వాన్ని ఈ శ్వేత పత్రంలో దోషిగా చూపించకపోవడం సిగ్గుచేటన్నారు. 2014-19 లో అద్భుతమైన అభివృద్ధి జరిగినట్లు శ్వేత పత్రంలో చెప్పారని, రాజధాని, పోలవరం, వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ ఇవ్వకుండా ఎలా అభివృద్ధి చెందిందో చెప్పాలని ప్రశ్నించారు. ఇంత అభివృద్ధి చేస్తే 2019లో టిడిపి ఎందుకు ఓడిపోయిందో శ్వేత పత్రంలో చెప్పలేదని ఎద్దేవా చేశారు. అప్పులలో కూరుకు పోవడానికి ప్రధాన కారణమైన ప్రపంచీకరణ విధానాలు, రాష్ట్ర విభజన నాటికి హామీలను అమలు చేయాలని బిజెపి వైఖరి గురించి టిడిపి, వైసిపి మాట్లాడకపోవడం దారుణం అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్ చెప్పినా ఒక్క రూపాయి కేటాయించలేదని విమర్శించారు. రాజధానికి రూ 15 వేల కోట్లు బడ్జెట్‌లోకేటాయించలేదని, వివిధ సంస్థల ద్వారా ఇప్పిస్తామని మాత్రమే చెప్పారని ప్రజలు గమనించాలన్నారు. ప్రపంచ బ్యాంకు విధానాలను తిప్పి కొట్టడానికి యుటిఎఫ్ లాంటి సంఘాలు, కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్. ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్‌లో 46 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారని తెలిపారు. తన పథకాల వల్లే విద్యార్థులు పెరిగారని గత ప్రభుత్వం గొప్పలు చెప్పిందని గుర్తు చేశారు. వాస్తవానికి 35 లక్షల 50 వేల మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ఈ రెండు నెలల కాలంలో రెండు లక్షల లోపు మాత్రమే పిల్లలు చేరారని చెప్పారు. ప్రతి ఏటా మూడు లక్షల మంది పిల్లలు తగ్గిపోతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ఒక్కొక్కరు ఒక్కొక్క కారణం చెప్పినా ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల విలీనం నష్టదాయకంగా మారాయని చెప్పారు. పిల్లలకు అర్థమయ్యే విధంగా బోధన ప్రయోగాలు ఉండాలని పేర్కొన్నారు. జీవో నంబర్ 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను కాపాడుకోవడం కోసం యుటిఎఫ్ ఇచ్చిన కార్యాచరణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హక్కులు బాధ్యతలు సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.విజయ్ కుమార్ పి. మహేష్ బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్. జాబీర్, హరి ప్రసాద్, అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవింద రాజులు, లింగమయ్య, సత్యసాయి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయ చంద్రారెడ్డి, సుధాకర్, నాయకులు, కార్యకర్తలు,పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహాలు మంజూరు

గృహ నిర్మాణ శాఖ పీడీ శివయ్య

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హులను గుర్తించి వారందరికీ గృహాలు కల్పించడమే తమ లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ పీడీ ఎస్.వి. శివయ్య పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో లబ్ధిదారులకు గృహ నిర్మాణం, బిల్లులు ఏ విధంగా ఇవ్వాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు .

జిల్లాలో గృహ నిర్మాణ శాఖ కార్యాలయాల వివరాలు తెలపండి ?

జిల్లా వ్యాప్తంగా రాయచోటి, మదనపల్లె, రాజంపేట డివిజన్‌లలో ఇఇ ఉన్నారు. రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె ప్రాంతాలలో డిఇలు ఉన్నారు. మండలానికి ఒక్కొరు చొప్పున 30 మండలాలకు 30 మంది ఎఇలు ఉన్నారు. 22 మంది వర్క్‌ఇన్‌స్పెక్టర్లున్నారు.

జిల్లావ్యాప్తంగా ఎన్ని లే అవుట్లు ఉన్నాయి ? ఎన్ని గృహాలు మంజూరైనాయి?

జిల్లా వ్యాప్తంగా 492 లేఅవుట్లు కాలనీలున్నాయి. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి 78,221 గృహాలు మంజూరు చేశాం..ఇందులో ఇప్పటి వరకు 33,240 గృహాలు పూర్తయ్యాయి. కలెక్టర్ సహకారంతో రాష్ట్రంలో 5 వ స్థానంలో ఉన్నాం. మిగిలినవి వివిధ దశలలో పనులు జరుగుతున్నాయి. ఇందులో ఇప్పటివరకు మొదలు పెట్టినవి 11,953, మట్టి తీసిన వి 10,519, పునదులు 19,684,గోడలు 7,069, స్లాబ్ లు 4,845 గృహాలున్నాయి.

ఒక్కో గృహ నిర్మాణానికి ఎంత మొత్తం మంజూరు చేశారు?

ఒకొక్క గృహానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.80 లక్ష రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. స్వయం సహాయక సంఘం ద్వారా రూ.35 వేలు వడ్డీకి రుణం మంజూరు చేస్తుంది. దీని ప్రకారం అయితే రూ . 2.15 లక్షలు అవుతుంది. లబ్ధిదారులకు కావాల్సిన మౌలిక వసతులను కూడా రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుంది.

బిల్లులు సకాలంలో అందుతున్నాయా?

ఇప్పటివరకు జిల్లాలో ఎక్కడ బిల్లులు పెండింగ్ లేవు. ఎవరికైనా బిల్లులు అందలేదంటే వెంటనే స్థానిక మండల గృహ నిర్మాణ శాఖ అధికారిని నియో జకవర్గంలో డిఇ సంప్రదించాలి.. అక్కడ పరిష్కారం కాకపోతే జిల్లా కేంద్రంలో కార్యాలయంలో లబ్ధిదారులు ఆధార్ కార్డును వాట్సాప్ ద్వారా పంపిస్తే వెంటనే వారికి ఏ స్థానంలో బిల్లులు పెండింగ్ ఉందో పరిశీలి ంచిన అ లబ్ధిదారులతో మాట్లాడి వెంటనే బిల్లులు అందిస్తాం. లబ్ధిదారులకు ఎటువంటి అపోహాలు పడాల్సిన అవసరం లేదు.

సిబ్బంది కొరత ఏమైనా ఉందా ?

జిల్లాలో గృహ నిర్మాణ శాఖలో లబ్ధిదారుల కొరత ఉన్నప్పటికీ ప్రస్తుతం ఉన్న గృహ నిర్మాణ ఃశాఖ సిబ్బందితో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా విధులు నిర్వహిస్తున్నాం.

బిల్లులు మంజూరులో సిబ్బందిపై ఫిర్యాదులొస్తున్నాయి. వీటిపై మీ స్పందన?

బిల్లుల మంజూరు విషయంలో మా సిబ్బంది డబ్బులు అడుగు తున్నారని ఇంతవరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ఏ ఒక్క లబ్ధిదారుడు ఒక రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. అటువంటి అపాహాలు ఎవరు పెట్టుకోవద్దు. ఒకవేళ ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే నాకు కానీ, ఎసిబికి కానీ ఫిర్యాదు చేయవచ్చు. సిబ్బంది ఎవరైనా డబ్బులు అడుగుతున్నారని లబ్ధిదారులు ఫిర్యాదులు చేస్తే వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకుంటాం.

లబ్ధిదారులకు మీరిచ్చే సూచనలు, సలహాలు?

ఇప్పటి వరకు మొదలు పెట్టని గృహాలను లబ్ధిదారులు వెంటనే పనులను ప్రారంభించాలి. నవంబర్ 30 నాటికి 100 శాతం గృహాలను పూర్తి చేయాలని సంకల్పంతో ఉన్నాం. నూతన ప్రభుత్వం ఏర్పాటయింది. గతంలో ఇస్తున్న మొత్తం మాత్రమే లబ్ధిదారులకు మంజూరవుతుంది. బిల్లు కూడా సకాలంలో అందుతున్నాయి.

దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలి

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె రెవెన్యూ డివిజన్ లోని 11 మండలాలకు చెందిన వేల ఎకరాల భూములకు చెందిన రికార్డులను నిర్వహించే సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని దహనం చేసిన నిందితులను ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటనను పూర్తిగా ఖండిస్తున్నా నన్నారు. గతంలో అడంగల్, జమాబందీ నిర్వహించవారని ప్రస్తుతం ఇవి ఇప్పుడేమయ్యా యంటూ ప్రశ్నించారు. లెక్కలు మాయం చేశారు. రెవిన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఘటన జరిగిన నాటి నుండి నేటి వరకు సిఐడి అధికారులు, పోలీసు అధికారులు దర్యాప్తు చేస్తున్న తీరు అభినందనీ యమ న్నారు. దోషులెంతటివారైనా వదొలద్దని, వారు ఖచ్చితంగా శిక్షింపబడాలని అన్నారు. రెవిన్యూ రికార్డులను కాపాడాల్సిన భాద్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. మదనపల్లెలో ఘటనపై చూపిన చొరవ విజయవాడలో పొల్యూషన్ బోర్డును తగలబెట్టిన దానిపై ఎందుకు చూపలేదని సూటిగా ప్రశ్నించారు. ఆ ఘటనలో ఐఎఎస్ పాత్ర ఉందని వదిలేశారా.. లేక మరేదనా కారణముందా అని అడిగారు. చిన్నవాళ్లను ఏవిధంగా ట్రీట్ చేస్తున్నారో పెద్దవాళ్లు తప్పు చేసినా వాళ్లను అదే విధంగా ట్రీట్ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. చట్టం అందరికీ ఒక్కటే అని నిరూపించాల్సినబాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఆంధ్రరాష్ట్రం లో తాము చేసిన అప్పు రూ. 7 లక్షల కోట్లేనని మాజీ సిఎం జగన్ ప్రస్తావించగా, ప్రస్తుత ఆర్థిక శాఖామంత్రి రూ. 12 లక్షల కోట్లు అప్పు చేశారని చెబుతుండడం ఏది నిజమో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. రెండు పార్టీలు చెబుతున్న దానిలో రూ.5 లక్షల కోట్ల వ్యత్యాసం ఉండడం ఏంటని ప్రశ్నించారు. నిజానికి రాష్ట్రంలో ఎంత అప్పు ఉందో ప్రజలకు తెలియజేయాల్సిన భాద్యత ఆర్థికశాఖ మంత్రిపై ఉందని అన్నారు.

తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి : 'మండిపల్లి'

ప్రజాశక్తి-రాయచోటి

రాబోయే ఆరు మాసాలలో రాయచోటి, నియోజకవర్గంలో పూర్తి నీటి సమస్య పరిష్కరించడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాగు, సాగు నీటిసమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని రాయచోటి నియోజకవర్గంలో రాబోయే ఆరు మాసాలలో పూర్తి నీటి సమస్య పరిష్కరించేందుకు ఒక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. గతంలో నియోజకవర్గ ప్రజలు నీటి సమస్యతో నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లి, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, ఈ ఆరు మండలాలలో ప్రజలకు ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే జిల్లాలో ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం నీటి సమస్య కొరకు బోర్లు వేయించడం, పైప్‌లైన్‌ల మరమ్మతులు చేపట్టడం, నిరుపయోగంలో ఉన్న మంచినీటి పథకాలను ఉపయోగంలోకి తీసుకురావడం, వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.రామాపురం మండలంలోని నల్లగుట్టపల్లి దళితవాడలో, సంబేపల్లి మండలంలోని దుద్యాల గ్రామం దిగువ మాదిగపల్లెల్లో రెండు కొత్త బోర్లను వేయించినట్లు తెలిపారు. జిల్లాలోని ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ఎక్కడ నీటి సమస్య ఉన్న వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. రాయచోటిని నీటి సమస్య రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సహకరించాని కోరారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

- వరుణ్ సాత్విక్ సెంచరీ - భారీ స్కోరు దిశగా కృష్ణా జిల్లా జట్టు



150 పరుగులు చేసిన వరుణ్‌స్వాతిక్



తలపడుతున్న చిత్తూరు, కృష్ణా జట్లు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-19 గ్రూప్ బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో చిత్తూరు, కృష్ణ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. కృష్ణా జట్టుకు చెందిన బ్యాట్స్‌మెన్ వరుణ్ సాత్విక్ సెంచరీ చేయడంతో ఆ జట్టు భారీ స్కోరు దిశగా ముందుకు దూసుకెళుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన కృష్ణా జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 370 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆ జట్టులోని వరుణ్ సాత్విక్ బ్యాటింగ్లో అద్భుతంగా రాణించాడు. 140 పంతులను ఎదుర్కొని 20 బౌండరీలు, 6 సిక్సర్ల సహాయంతో 158 పరుగులు(సెంచరీ)చేశాడు. బి. గీత్ 84(నాటౌట్), ధనుష్ 48 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ 4 వికెట్లు తీసుకున్నాడు. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో శ్రీకాకుళం, కడప జట్ల మధ్య హోరాహోరీగా సాగుతోంది. తొలుత బ్యాటింగ్ కు దిగిన శ్రీకాకుళం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 63.3 ఓవర్లలో 204 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కె థామస్ రామ్ కుమార్ 104 పరుగులు (సెంచరీ)చేశాడు. పూర్ణ 32 (నాట్ అవుట్) పరుగులు చేశాడు. కడప జట్టులోని పి ధీరజ్ కుమార్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ ఆద్రిత్ రెడ్డి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసిన సమయానికి 26.0 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. ఆ జట్టులోని గురు విగ్నేష్ 59, రోహిత్ 39 (నాటౌట్) పరుగులు చేశారు. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో విశాఖపట్నం, వెస్ట్ గోదావరి దట్ల మధ్య ఉత్కంఠగా మ్యాచ్ సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన విశాఖపట్నం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 53.0 ఓవర్లలో 171 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కేఏఎస్. ప్రసాద్ 58, యశ్వంత్ 27 పరుగులు చేశారు. వెస్ట్ గోదావరి జట్టులోని మహబూబ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు, మరో హర్షవర్ధన్ 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 33.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. ఆ జట్టులోని చరణ్ సాయి తేజ 42 పరుగులు చేశాడు. విశాఖపట్నం జట్టులోని పిడి రచిత్ 3,ఎం. యువన్ 3 వికెట్లు తీసుకున్నారు.

అవినీతి అక్రమాలను సహించేది లేదు

- ఎన్నికైన నాడే ప్రతి ఒక్కరికి చెప్పా
- నేను ఎలా అక్రమాలు చేస్తా
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

అవినీతి అక్రమాలను సహించేది లేదని, ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే సొంత పార్టీ వారైనా కఠిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలినాళ్లలోనే తాను ప్రకటించానని మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం తన ఇంట్లో సిఐ మల్లికార్జున గుప్త ఆధ్వర్యంలో పోలీసులు, రెవెన్యూ సోదాలు నిర్వహించారు. సాయంత్రం నాలుగున్నర గంటల నుంచి రాత్రి 8:30 వరకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సోదరులు నిర్వహించగా అందులో ఎలాంటి పత్రాలు దొరకలేదు. దీంతో పోలీసులు ఏ సందర్భంలో నైనా విచారణకు తమకు సహకరించాలని నోటీసులు ఇచ్చి వెను తిరిగారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను అవినీతి అక్రమాలకు చాలా దూరమని, పారదర్శమైన పాలన అందించాలని ఉద్దేశంతో తాను రాజకీయాలకు వచ్చానని తెలిపారు. ఈ ఐదేళ్ల పరిపాలనలో తమ పార్టీలోని వారు ఎవరైనా సరే అక్రమాలకు పాల్పడితే సహించలేదని, వారిపై చర్యలకు తాను ముందుంటానని చెప్పానన్నారు. తమ ఇంట్లో జరిగిన సోదాల్లో ఎలాంటి ఆధారాలు, పత్రాలు దొరకలేదని స్పష్టం చేశారు. తనకు అవినీతి అంటగట్టడం సరికాదని, తాను పారదర్శకంగా ఉంటానని ఈ సందర్భంగా వివరించారు.

రక్తదాతలకు హాట్‌బాక్స్‌లను అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు బిర్యానీ కార్నర్ ప్రొప్రైటర్ లక్ష్మణ్ తన భార్య మిండిగళ్ళు శ్రావణి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం తిరుపతిలో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపుగా 250 మందికి అన్నదానం చేశారు. రక్తదాతలకు హాట్ బాక్సులను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో సభ్యులు అందిస్తున్న సహకారం ఎనలేనిదని అన్నారు. ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, వీటిని భవిష్యత్తులో మరింత విస్తృతం చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శ్రావణి, డాక్టర్ శ్రీకాంత్, మిండిగళ్ళు వెంకటేష్, బూర్లపల్లి నవీన్ పాల్గొన్నారు.

నేడు వీరబల్లి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-వీరబల్లి

వీరబల్లి మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపిడిఒ రామచంద్రారెడ్డి తెలిపారు. సమావేశానికి మండలంలోని 12 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, పాల్గొనాలని సూచించారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని అన్నారు. అధికారులు తమ అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు.ప్రజా సమస్యలను సమావేశంలో చర్చిస్తామని చెప్పారు.

నిమ్మనపల్లె తహశీల్దార్ బదిలీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

నిమ్మనపల్లె తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఎ.వాణిశ్రీరాజు అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు. శనివారం కలెక్టర్ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బదిలీపై వచ్చిన తహశీల్దార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం నుంచి నిమ్మనపల్లెకు వచ్చిన తహ శీల్దార్ బాలాజీ రాజు తిరిగి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డిటి తపస్విని, రెవెన్యూ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయ బాధ్యతలు డిటికి అప్పగించారు. రెవెన్యూ ఉద్యోగులందరూ బాధ్యతగా తమ విధులు నిర్వర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణం, చిత్తూరు రోడ్డు మోడల్ కాలనీలో నూతనంగా వెలసిన శ్రీ ఎల్లమ్మ తల్లికి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించి, తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త, నిర్వాహకులు దేవి రెడ్డి వెంకటరమణా రెడ్డి ఆధ్వ ర్యంలో అర్చకులు శ్రీనివాస్ దీక్షితులు, పూజారి శ్రీరాములు అమ్మవారికి అభిషేకం, తోమాల సేవ, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో పాటు ప్రశాంత్ నగర్, పట్టణ వాసులు ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. జాతీయ రహదారి పక్కన ఆహ్లాదకర వాతావరణంలో ఆలయం ఉండ డంతో స్థానికులు, ఆ మార్గంలో వెళ్లేవారు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

వీధుల్లో తిరుగుతున్న శునకాలు

శునకాలతో జనం బెంబేలు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో దిరాపల్లి పంచాయతీలో ఇంకా కొన్ని గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. కుక్క లు మందలుగా తిరుగుతూ గొర్రెలను, మేకలపై దాడి చేసి చంపుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మనుషులపై, ద్విచక్ర వాహనంలో పోయే టప్పుడు వెంటపడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠ శాలలతో పాటు వివిధ విద్యాసంస్థలకు వెళుతున్న చిన్నారులను వెంబడిస్తున్నా యని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చేపట్టి గ్రామాల్లో కుక్కల నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

ప్రజాశక్తి-కలికిరి

భారీ భద్రత ఏర్పాట్ల మధ్య ఎల్లమ్మ జాతర మొదలైంది. స్థానిక మండల కేంద్రంలో ప్రతి ఏటా అంగరంగ వైభవంగా మూడు రోజులు పాటు జరిగే ఎల్లమ్మ జాతరకు సిఐ మోహన్ ఆధ్వర్యంలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. అట్ట హాసంగా శనివారం మొదలై ఆదివారం ఉదయం సిద్ధపుట అనంతరం మహి ళలంతా దీపం, బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. రాత్రి 12 గంట లకు చాందిని బండ్లు భారీ ఊరేగింపుతో చెక్కభజనలు, పిల్లన గ్రోవులు, భారీ బాణసంచా మధ్యలో చాందిని బండ్లు తిరిగాయి. జాతర ఏర్పాట్లను బదురుకు ఎస్‌ఐలు, ముగ్గురు సిబ్బంది, పోలీసు సిబ్బందితో దాదాపు 200 మందితో జాతర మొత్తం నిఘా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రజలు సహకరించాలని తెలిపారు.

నందలూరులో..

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ నారాయణ రాజుపేట గ్రామంలో వెలసిన ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అత్యంత సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలను సమర్పించారు. భక్తులు జాతరలో పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు.

కలికిరి: వైభవంగా ఎల్లమ్మ అమ్మవారి ఊరేగింపు

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా :'నల్లారి'

ప్రజాశక్తి-కలకడ

ప్రతి కార్యకర్తకు ఎల్లవేళలా అండగా ఉంటానని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.మండలంలోని రాతిగుంటపల్లి పంచాయతీలో బట్టవాండ్లపల్లెలో ప్రత్యేక కార్యక్రమం ఆయన పాల్గొని మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా తన గెలుపు కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు చేదోడు వాదోడుగా ఉండి సహకారం అందిస్తానని తెలిపారు. గతంలో పనిచేసిన ప్రభుత్వం తీరును చూస్తుంటే రాక్షసపాలను నిదర్శనంగా ఉందని అన్నారు. ఎక్కడ చూసినా భూములు కబ్జాలు చేసిన ఘనత గత ప్రభుత్వానికి చెల్లుతుందని ఘాటుగా విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి తనుజారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్‌నాయుడు, కార్యకర్తలు శ్రీరాములు నాయుడు, జనార్దన నాయుడు, మండలంలోని కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి దంపతులను గజమాలతో సన్మానిస్తున్న టిడిపి నాయకులు

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

మూడురోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న కోర్టు సిబ్బంది

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ద్విచక్ర వాహన ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లక్కిరెడ్డిపల్లి సివిల్ కోర్టు జడ్జిపై జున్నిసా పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వ ర్యంలో స్థానిక మూడు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్షణ లేని ప్రయాణం ప్రమాదకరమని ప్రతి వాహనదారుడు ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. అతివేగం ప్రమాదకరమని, ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణకులను ఆటోలో ఎక్కించుకుని అతివేగంతో ప్రయాణిస్తూ ప్రాణాలు మీదికి తెచ్చుకుంటున్నారని అన్నారు. రోడ్డుమీద పడుతున్నాయని నెమ్మదిగా ప్రయాణించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరమని ఎక్కువ అన్నారు. కార్యక్రమంలో సిఐ జీవన్, గంగానాథ్‌బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్, న్యాయవాదులు, ఎంఎల్ రామచంద్రారెడ్డి, చెన్న కృష్ణయ్య, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

హెపటైటిస్ ప్రాణాంతక అంటువ్యాధి

ప్రజాశక్తి-పీలేరు

హెపటైటిస్ చాలా ప్రమాదకరమైన కాలేయ సంబంధిత వైరల్ అంటు వ్యాధి అని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. ఆదివారం ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా కోటపల్లి బిసి బాలుర వసతి గృహ విద్యార్థులకు 'హెపటైటిస్ వ్యాధి- జాగ్రత్తలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ హెపటైటిస్ శుభ్రంలేని ఆహారం, నీరు, కలుషితమైన రక్తం ద్వారా సోకుతుందని అన్నారు. వ్యాది గ్రస్తుని శరీరంలోని రక్త స్రావాలు, మూత్రం, వీర్యం ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఉచిత రక్తపరీక్షల ద్వారా దీన్ని నిర్ధారించుకుని, చికిత్స పొంది, 2030 నాటికి హెపటైటీస్ వ్యాధి రహిత సమాజానికి అందరూ సహకరించాలని డాక్టర్ అభ్యర్ధించారు. వ్యాధి నియంత్రణలో భాగంగా శిశువులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో హెపటైటీస్ బి వాక్సిన్ కూడా ఇవ్వడం జరుగుతొందని తెలిపారు. కార్యక్ర మంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, వసతి గృహ సంక్షేమ అధికారి మున స్వామినాయక్, ఎఎన్ఎం భార్గవి, సిహెచ్‌ఒ చంద్రకళ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హెపటైటిస్ వ్యాధి గురించి విద్యార్థులకు వివరిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్ రెడ్డి

పేదలకు సేవ చేయడం అభినందనీయం

ప్రజాశక్తి-రాయచోటి

మానవత సేవలు అభినందనీయమని టిడిపి యువనేత మండిపల్లి రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేటలో ప్రతిభా జూనియర్ కళాశాలలో నెలవారి సమావేశం మానవతా సంస్థ అధ్యక్షులు ఖాదర్‌బాషా, సెక్రెటరీ అంకం జయచంద్రారెడ్డి, కోశాధికారి మురళీ మోహన్ నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, యూని యన్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, చార్మినార్ హోటల్ యాజమాన్యం ఫయాజ్ ముఖ్య అతిథులకు హాజరయ్యారు. మానవతా శాఖ చైర్మన్ ఆరమాటి శివగం గరెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు సహదేవరెడ్డిలు అతిథులను సన్మానించారు. ఈ సందర్భంగా రాహూల్ రెడ్డి మాట్లాడుతూ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మానవత సంస్థకు ఫ్రీజర్ బాక్స్ వితరణ చేయున్నట్లు తెలిపారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సహకారంతో ఎలక్ట్రికలల్ శ్మశాన వాటిక కొరకు కావాల్సిన స్థలానికి కృషి చేస్తామని అన్నారు. కుల,మత బేధాబి ప్రాయాలు లేకుండా ఆపదలలో సహాయం కోరిన వారికీ నిష్పక్ష పాతంగా సేవలంది చేందుకు కృషి చేస్తున్న మానవత సంస్థ వ్యవస్థాపకులకు,అందుకు సహక రిస్తున్న ప్రతి ఒక్కరికి అభినందలు తెలిపారు. పర్యావరణాన్ని పెంపొందించేలా మొక్కలు నాటడం వాటిని సంరక్షించేలా చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమలో మానవత కుటుంబ సభ్యులతో పాటు నరేష్, రెడ్డెప్ప, శ్రీను, సూరి, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా మంత్రి 'మండిపల్లి'

ప్రజాశక్తి-రాయచోటి

గత మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి అండగా నిలిచిన రాయచోటి మైనార్టీల సమస్యలపై మంత్రి మండిపల్లి ఎప్పటికప్పుడు స్పందించడం సంతోషంగా ఉందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గం ఏర్పడనప్పటి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి విజయాన్ని శాసిస్తూ వస్తున్న మైనార్టీలు అధికంగా గల కొత్తపల్లి ప్రాంతం అభివృద్ధికి నోచుకోక అక్కడున్న మైనార్టీలు చాలా ఇబ్బందులు ఎదుర్కొనే వారిని చెప్పారు. సుమారు 25 వేల మందికి పైగా జనాభా గల కొత్తపల్లి ప్రాంతాన్ని టిడిపి అధికారంలోకి వస్తే అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చిన మంత్రికి మైనార్టీలు సార్వత్రిక ఎన్నికల్లో అండగా నిలిచి విజయానికి కృషి చేశారని అన్నారు. మంత్రి సోదరుడు రాహుల్‌రెడ్డి కొత్తపల్లె ప్రాంతంలో విస్తృతంగా పర్యటిస్తూ మైనార్టీల సమస్యలను తెలుసుకుంటూ పారిశుధ్య సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులతో కలిసి ప్రతిరోజు పర్యవేక్షిస్తూ ఎక్కడ సమస్యలను అక్కడ పరిష్కరిస్తూ వస్తు న్నారని చెప్పారు. పదవ తరగతితోనే చదువు మానేస్తున్న మైనార్టీ విద్యార్థుల సౌకర్యం కొత్త పల్లి ప్రాంతానికి జూనియర్ కళాశాలను మంజూరు చేయాలంటూ మంత్రి నారా లోకేష్ ను కలిసి సమర్పించారన్నారు. ఎక్కువమంది కూలీలు, బీడీ కార్మికులు ఉన్న కొత్తపల్లి ప్రాంతంలో ప్రత్యేక ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటుకు మంత్రి మండిపల్లి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో పోటీ తత్వం ఉండాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


వ్యాసరచన పోటీల్లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విద్యార్థులలో పోటీ తత్వం ఉండాలని ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపకులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ అన్నారు. ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక భారతీయ విద్యానికేతన్ పాఠశాలలో జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్తాజ్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ తత్వమున్నప్పుడే భవిష్యత్తులో ఏ రంగంలోనైనా రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులలో సృజ నాత్మక శక్తి పెరుగుతుందన్నారు. ఈ పోటీలకు పలు పాఠశాలల నుంచి విద్యా ర్థులు హాజరయ్యారని, ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 31న హిందీ రచయిత ప్రేమ్‌చంద్ జయంతి రోజున బహుమతులు అందిస్తామని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ కుమార్ రఘురామ నాయుడు

సూర్యనారాయణకు సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి బహిష్కరణకు గురైన జి.ఆస్కారరావు, డి.శ్రీకాంత్‌రాజు మీడియా సమావేశం పెట్టి ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణను అధ్యక్షుడిగా బహిష్కరించామని చెప్పడం హాస్యాస్పదమని సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి రఘురామనాయుడు అన్నారు. రాష్ట్ర అధ్యక్షునికి తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యనారాయణపై గత వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టినప్పుడు అక్రమ మార్గంలో అధ్యక్ష పదవి చేపట్టాలని సమావేశాలు పెట్టి ఆస్కార రావు అబాసు పాలయ్యారని తెలిపారు. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై రాష్ట్ర అధ్యక్షులు పోరాటం చేస్తూ ఉంటే వైసిపి నాయకులతో కుమ్మక్కై, మళ్ళీ వైసీపీ ప్రభుత్వం వస్తుందని సమావేశాలకు హాజరు కాకుండా సంఘం సభ్యులను బెదిరించి సంఘ నియమావళిని ఆస్కారరావు ఉల్లంఘించారని విమర్శించారు.చిల్లర ప్రచారాన్ని ఎవరు నమ్మరని హెచ్చరించారు.సమావేశంలో కార్యదర్శులు సుదర్శన్ రెడ్డి, వెంకట సుబ్బయ్య, చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ప్రసాద్ గౌడ్, రాధాకృష్ణారెడ్డి, నాగ శేషడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ ప్రసాద్, నాగరాజు, నాయకులు రామాంజనేయులురెడ్డి, ఖాదరయ్య, సురేంద్ర, రామకృష్ణారెడ్డి, కుమారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగేంద్ర

పెండింగ్ మెస్ బిల్లులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - కడప

పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని పిఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సి.పి.నాగేంద్ర, ఎఐబిఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షులు జగన్‌నాయక్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులు పెండింగ్‌లో ఉన్న మిస్ బిల్లులు విడుదల చేయాలని అన్నారు. ఆదివారం నగరంలోని బాలుర హాస్టల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ గురుకుల వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు గత ఎనిమిది నెలలుగా మెస్ ఛార్జీలు అందలేదన్నారు. నిత్యావసర సరుకులు రోజుకు పెరిగి పోవడంతో నిర్వహణ భారంగా ఉందని పేర్కొన్నారు. మెస్ ఛార్జీలు అందకపోవడంతోవిద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వరుణ్, కృష్ణ, తేజ పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' అమలు ఎప్పుడో..!

ప్రజాశక్తి - వేంపల్లె :అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చేం దుకు అన్నదాత సుఖీభవ పథకం ఒక ప్రధాన కారణమన్నారు. వైసిపి ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ప్రతిఏటా ప్రతి రైతు కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6వేలతో కలుపుకొని 3 విడతలుగా రూ.13,500 ఇచ్చేదని చెప్పారు. టిడిపి కూటమి అన్నదాత సుఖీభవ అని పేరు మార్చి ఏడాదికి రూ.20 వేలు ఆర్థికసాయం చేస్తా మని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. చంద్ర బాబు మాట లను రైతులు నమ్మి ఓట్లు వేశారని తెలి పారు. అధి కారంలోకి వచ్చి 45 రోజులు అయి నప్పటికీ అన్న దాత సుఖీభవ పథకంపై అతిగతీ లేదన్నారు. ఈ జిఒను అప్పట్లో కాంగ్రెస్, వామపక్షాలు, టిడిపి వ్యతిరే కించాయన్నారు.

తాగునీటి బోరును ప్రారంభిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ దళితవాడలో కొంత కాలంగా తాగునీటి సమస్యతో ఏర్పడటంతో గ్రామస్తులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి ప్రత్యేక నిధులతో ఆ గ్రామానికి ఆదివారం బోరు వేయించడం జరుగుతోందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం దళితవాడలో తాగునీటి కోసం ఏర్పాటుచేసిన బోరును ప్రారంభిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి విడత నీటి సమస్య అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి ఆ గ్రామాలకు మంత్రి చొరవతో నియోజకవర్గ వ్యాప్తంగా బోర్లు వేయించి నీటి ఎద్దడిని పరిష్కారం చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిరేవుల రమేష్‌రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భోజనాన్ని అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలం, తుమ్మరకుంట పంచాయతీ పరిధిలో పీర్ల పండుగ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం పీర్ల జల్దీ కనుల పండుగలా సాగింది. ఈ కార్యక్రమానికి మండలం నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ నేపథ్యంలో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులు, ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ మాట్లాడుతూ పీర్ల పండుగ మహోత్సవం ఎంతో పవిత్రమైందని అన్నారు. పీర్ల జల్దీ రోజున ఫౌండేషన్ తరపున అన్నదానం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మహేష్‌రెడ్డి

ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండల కేంద్రం పెద్దమండ్యంలో మాజీ సర్పంచ్ గుడి రెడ్డెమ్మ ఆధ్వర్యంలో డాక్టర్ మహేష్‌రెడ్డి మదనపల్లి రమా నేత్రాలయం సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 250 మందికి పరీక్షలు నిర్వహించి ఇందులో 80 మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుడి నాగరాజు, రామాంజినేయులు, నారా నాగేశ్వర్, మస్తాన్, చిన్నరెడ్డి బాషా, సుబ్బయ్య, తిమ్మాయ్య, రెడ్డిపీర్, మణికంఠ పాల్గొన్నారు.

'మానవత' పీలేరు కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి-పీలేరు

2024-25 సంవత్సరానికి గాను మానవత పీలేరు శాఖ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కార్యనిర్వాహక విభాగం కమిటీ అధ్యక్షులుగా శెట్టి సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా బొగ్గారపు వెంకట సురేష్, కోశాధికారిగా ఎం. జగన్మోహన్, ఉపాధ్యక్షులు ఎస్. జైపాల్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి మల్లికార్జున, సభ్యులుగా కె. నాగమణి, పి. సుధాకర్‌బాబు, జె.మురళీ మోహన్‌రాజు, పసల చంద్రమౌళి, ఆర్.విజయ మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చైర్మన్ డాక్టర్ వి.రామచంద్ర ప్రకటించారు. కమిటీ చైర్మన్ గా వి. రామచంద్ర, కో-చైర్మన్ ఆర్.కృష్ణమూర్తి, కన్వీనర్ యర్రంశెట్టి వెంకటరమణ, సభ్యులుగా ఎం. లక్ష్మీ ప్రసాద్ నాయుడు, టి. రహత్ బాష, జివి రమణ, విజయ కుమారి, ఎం. నాగరాజు, ఆత్మకూరు రెడ్డప్ప ఎన్నికయ్యారు. అడ్వైజరీ కమిటీ సభ్యులుగా ఆర్.రాజగోపాల్‌రెడ్డి, బి. వెంకటరాజు, ఎస్.అక్రమ్‌బాషా, పి.రామమోహన్, రాయ ఆనంద, ప్యారుఖాన్, ఎస్.గఫార్ సాహెబ్, డాక్టర్ పోతంశెట్టి రమేష్, పెంజూరి అశోక్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులచేత మానవతా ప్రతిజ్ఞ చేయించి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు..

క్రైం కార్నర్

టేకలకోన ఎంపిపి పాఠశాలలో చోరీ

ఎల్ఇడి టివి అపహరణ : పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

చెల్లాచెదురైన బీరువా

గుర్తు తెలియని దుండగులు చోరికి పాల్పడిన సంఘటన మండలంలోని టేకలకోన ఎంపిపి పాఠశాలలో చోటు చేసుకొంది. ఉపాధ్యాయుడు శివప్రసాద్ కథనం మేరకు.. శనివారం విధులు ముగించుకొని తాళాలు వేసుకొని ఇంటికి వెళ్లామన్నారు. గుర్తు తెలియని దుండగులు పాఠశాలలోకి ప్రవేశించి, పాఠశాలలో ఉన్న రూ.40వేలు విలువ చేసే 55 ఇంచీల ఎల్ఇడి టివిని దొంగలించుకొని పోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాఠశాలలో ఉన్న బీరువాను పగలగొట్టి రికార్డులను చిందరబందర చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు, పాఠశాల వంట మనిషి ఆదివారం ఫోన్ చేయడంతో హుటాహుటిన పాఠశాలకు చేరుకొని, పోయిన వస్తువులను గుర్తించి తమ పైఅధికారులతో పాటు వాల్మీకపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని, పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి-ములకలచెరువు

పిటిఎం మండలంలోని సదుం పంచాయతీకి చెందిన చిట్టిబాబు కుమార్తె సుమన్ శ్రీ భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను కర్ణాటక రాష్ట్రం నందిగుడికి చెందిన రాజప్పకు ఇచ్చి గత ఏడేళ్ల క్రితం వివాహం జరిగినట్లు తెలిపారు. తన భర్త గత రెండేళ్ల కాలంగా వివిధ కారణాలు చూపుతూ వేధిస్తున్నాడని పేర్కొంది. అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎఎస్ఐ వెంకటస్వామి వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు తెలిపారు.